


# ఒక మౌనం వెనకాల....

1997 ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక, న్యూజెర్సీ కళాసమితి నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

-చెమన్‌సింగ్




జీవితానికి అత్యంత అందమైనదేమిటి?

బహుశా శాస్త్రవేత్తలు సహితం సరైన జవాబు చెప్పలేరేమో! కానీ నా మటుకు నేను 'మౌనం' అని జవాబివ్వగలను.

అవునూ... ప్రతిరోజూ ఆ యువకుడు అలా బాల్కనికి ఎదురుగా కూర్చుని సముద్రం వంక దీక్షగా చూస్తూ నిండా మౌనంలో మునిగి ఉంటాడు.

మౌనం ఇతనికి అంత అందాన్ని స్తుందా? ఒక్కోసారి చీకటి పడేవరకూ పడమటి దిక్కున నిశ్శబ్దమైన ఆకాశం వంక చూస్తూ అలా ఉండిపోతాడు.

చాలా చిత్రంగా అతనితో ఓసారి మాట్లాడాలనే కోరిక బలపడుతుంది. బహుశా ఫ్రాయిడ్ సైకలాజికల్ థీమ్ నా పట్ల నిజమేననిపిస్తుంది.

కావాలనే ఓసారి ఆయన బీచ్ వెంట నడుస్తున్నప్పుడు వెనకాలే వెళ్ళాను. ఇసుక తిన్నెల మధ్య మూవులను పాతు కుంటూ నడుస్తున్న ఆయనలో... అదే మౌనం... కొద్దిగా వేగంగా ముందుకు కదిలి ఆయన ప్రక్కగా నడుస్తూ...

ఎక్స్‌క్యూజ్‌మీ... కొద్దిగా ఆశ్చర్యపో యాడు.

నా పేరు సంగీత! ఇక్కడికి దగ్గరే మా యిల్లు అన్నాను నేనే ముందుగా పరిచయం చేసుకుంటూ... అతనేమీ మాట్లాడలేదు.

ఈ మధ్యే రోజూ మిమ్మల్ని గమనిస్తు న్నాను. మీరింత మౌనంగా అంతసేపు ఎలా గడిపేస్తున్నారు?

ఆయన మరోసారి తలెత్తి నావంక చూసి... మళ్ళీ తలదించుకుని నడు స్తూనే ఉన్నాడు. నాకు మీతో స్నేహం చేయాలనుంది. అవకాశం ఇస్తారా? అన్నాను నేనే మళ్ళీ....

అలా నడుస్తూ చాలా దూరం వెళ్ళిపోయాం. ఎందుకు? అన్నాడు ముక్తసరిగానె...

ఎందుకంటే...! ఎందుకు!? ఎందు కంటే.... ఆ... మీ మౌనం చూసి... ఎస్.... ప్రపంచాన్నీ, జీవితాన్ని... అందాన్నీ, ఆనందాన్నీ అనుభవించగ లరు.

మీరు చాలా విచిత్రంగా మాట్లా డతారు అన్నాడు. ఇసుకపై కూలబ డుతూ...

చెప్పండీ... నాతో స్నేహం చేయగ లరా...? అన్నాను ఆయనకి కొద్దిదూ రంలో కూచుంటూ....

ఆయనదో ఆలోచనలో పడిపో యాడు.

ఇష్టం లేకపోతే చెప్పండి అన్నాను.

సరే మీతో స్నేహం చేయడానికి నాకేం అభ్యంతరంలేదు. అయితే ఒక షరతు... అన్నాడు.

ఏమిటది?

.....

అవునూ మీరు నా పట్ల ప్రేమలో పడకూడదు. మీరు నాకు ఈ విష యమై మాటివ్వండి. ఆశ్చర్యంగా చూశాను అతనివంక. విచిత్రమైన మనిషిలా వున్నాడు.

సరే.... అన్నాను.

* * * * *

ప్రపంచాన్ని వేసివ్వడు బాగా తెలుసుకుంటున్నట్టనిపిస్తుంది. జీవితం గొప్పది... దాన్ని విస్తృత పరచాలంటాడతను. ఈ మూడు నెలల కాలంలో... బహుశా నాలో నుండి మరో వేమగా పరివర్తనం చెందుతున్నానేమో..

సముద్రగాలి ఆహ్లాదంగా ఉంది. సముద్రాన్ని జీవితానికి జోడించి చాలా గొప్పగా చెపుతాడతను.

ప్రక్కనే ఆయన ఏదో ఆలోచిస్తూ సముద్రం వంక చూపును పరుచుకున్నాడు.

నేనో విషయం అడగనా... అన్నాను సందేహిస్తూ ఆడగండి...

మీరెందుకంత మౌనంగా ఉంటారు. అంతకుముందు అలా ఉండేవాన్నేమో! కానీ మీ పరిచయం తర్వాత ఆ పరిస్థితి చాలా మారింది.

కొంత మారిన మాట నిజమే... కానీ మీ మౌనం వెనకాల ఏదో ఉందనిపిస్తుంది నాకు.

మౌనం వెనకాల ఏమీ ఉండదు. ఏమీ ఉండకపోవడమే మౌనం.

కావచ్చు... కానీ ఒక్కోసారి కొన్ని విషయాలు మౌనాన్ని ఆశ్రయిస్తాయి కదా...

అవుననుకోండి... అతడేదో తడబడుతున్నట్టుగా అనిపించింది. బహుశా మౌనం మీకు చాలా ఆనందాన్నిస్తుందనుకుంటాను.

ఒకరకంగా...

పోనీ మీరెవరినైనా ప్రేమించారా?

ఆయనేమీ సమాధానం చెప్పలేదు.

నాకేదో మాట్లాడాలని ఉంది... ప్రతి రోజూ ఇలా మిమ్మల్ని కలుసుకోవడం నాలో క్రొత్త ఆశలకు... క్రొత్త ఉత్సాహానికే తావిస్తుంది. నేనీ సంతోషాన్ని జీవితకాలం సొంతం చేసుకోవాలనుకుంటున్నాను.

అంటే....!? అన్నాడతను.

సమాధానం లేని నా మౌనంతో రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

మీ సహచర్యాన్ని శాశ్వతం చేసుకుంటే బాగుండునని...

అతను అదే మౌనవీక్షణాన్ని సముద్రంపై పరిచి నిశ్శబ్దంగా ఉండిపోయాడు. తర్వాత అతనన్నాడు.

నేను మీకు ముందే చెప్తాను. మీరు నన్ను ప్రేమించకూడదని.

దీన్ని ఏమంటారో నాకు తెలియదు. ఒకవేళ మీరంటున్నట్టు ప్రేమే అయితే.. మీరు దానికి ఏపేరైనా పెట్టండి.

అతనేమీ మాట్లాడలేదు.

పోనీ ఇంతకుముందు ఎవరితోనైనా పరిచయం ఉందా? ఐపీఎస్... ఎవరికైనా మనసిచ్చారా? మీరన్నట్టు దాన్ని ఏమంటారో నాకు తెలియదు. అది ప్రేమే అయితే కావచ్చు.

ఏవరా అమ్మాయి!? అన్నాను ఆసక్తిగా అతనో నిమిషం సముద్రం వంక తదేకంగా చూస్తూ ఉండిపోయి చెప్పడం ప్రారంభించాడు.

కొంతకాలం క్రితం వరకు నేనూ వైష్ట్ స్ట్రీట్‌లోని తొమ్మిదవ సెక్టార్ ప్రాంతంలో ఉండేవాన్ని. కాలేజీ చదువయ్యాక ఓ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా చేరాను.. నా గది మేడపైన ఉండేది.

ఇంటి యజమాని వాళ్ళు క్రింది పోర్షన్‌లో ఉండేవాళ్ళు. వాళ్ళింట్లో తండ్రి, కూతుళ్ళు మాత్రమే ఉండేవాళ్ళు. కొద్దికాలం తర్వాత ఆ అమ్మాయితో పరిచయం ఏర్పడింది.

ఒక నిశ్చల ప్రకృతిని ఫ్రేంలో బంధించినట్టుండేది.

ఆమె పరిచయం తర్వాత నేను చాలా సమయాన్ని గదిలోనే గడిపేవాన్ని. జీవితం ఏదో క్రొత్త దారుల్లోకి మళ్ళుతున్నట్టు ఫీలయ్యేవాన్ని. ఇద్దరి మధ్య అనుబంధం రోజు రోజుకీ ఎక్కువైంది. బహుశా మీరు దాన్ని ప్రేమ అంటారేమో అనండి. నాకేం అభ్యంతరం లేదు. ఓ రోజు హఠాత్తుగా ఆమె నా గదికి వచ్చి రేపు ఉదయాన్నే ఢిల్లీలోని తన బంధువుల ఇంటికి వెళతున్నానని చెప్పింది. రావడానికి చాలా రోజులే పట్టవచ్చునని చెప్పింది. నేను కొంత బాధపడ్డ మాట నిజం కానీ కాదని చెప్పడానికి నాకేం అధికారం ఉంది? మౌనంగా ఉండిపోయాను. ఆ తర్వాత కొద్ది రోజులయ్యాక మాటల మధ్య వాళ్ళ నాన్నని అడిగాను. ఇంకా రాలేదేమని.

ఆమింక రాదని... అక్కడే బంధువుల అబ్బాయితో పెళ్ళి నిశ్చయమైందనీ... పెళ్ళి కూడా అక్కడే చేస్తామని చెప్పాడు. నేను స్థాణువునయ్యాను. ఏం మాట్లాడాలో తోచలేదు. వెంటనే నా గదిలోకి వెళ్ళిపోయి తలుపులు మూసుకుని ఆ నిశబ్ద చీకట్లో ఒంటరిగా




సింగిల్ బెడ్ రూం ఫ్లాట్ రూ. 81,000/- లు

డబుల్ బెడ్ రూం ఫ్లాట్ రూ. 1 లక్ష కే

**నమ్మకానికి నాణ్యతకు మరో పేరు - జనప్రియ నిర్మాణాల తీరు**

ఒక పుష్కరం నుండి, మధ్య తరగతి వారికి ఆశ్రయమే ఆశయంగా, జంటనగరాలలో వివిధ ప్రాంతాల్లో దాదాపు 6000 ఫ్లాట్లు నిర్మించి, మరో 4000 ఫ్లాట్లు నిర్మాణానికి పునాది వేస్తూ, మధ్య తరగతి వారిని సొంత ఇంటి వారిని చేస్తూ, గృహనిర్మాణ రంగంలో నాణ్యతకు, నమ్మకకు ప్రతీకగా నిలచి, మేనేజ్‌మెంట్, ప్లానింగ్, డిజైనింగ్, ఎక్సిక్యూషన్, మార్కెటింగు విభాగాలన్ని ప్రతిభావంతులైన ఇంజనీర్లచే నిర్వహింప బడుతూ, సొంత సిమెంట్, బ్రిక్స్, ఫ్లోరింగ్ టైల్స్, బిల్డింగ్ మెటీరిల్స్ కలిగి వున్న ఏకైక సంస్థ జనప్రియ ఇంజనీర్స్ సిండికేటు, నేడు, ప్రవేటు, ప్రభుత్వ ఉద్యోగస్థులకే కాక, వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలలో పని చేయు ఉద్యోగస్థులకు, వ్యవసాయదారులకు సైతం గృహవసతి కల్పించు **OWN YOUR HOUSE (OYH)** స్కీముకు ప్రప్రథమంగా ప్రవేశ పెట్టి, స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంవత్సరాన, అందిస్తున్న అపూర్వ సువర్ణకానుక

# జనప్రియ మహానగర్

డి.ఆర్.డి.యల్. మిధానికి దగ్గర, 'కోటి' కి కేవలము 12 కి.మీ. **3600 FLATS**

*For Demand Survey*



**HIGHLIGHTS**

- Free from pollution.
- All flats are as per Vaastu
- Surounded by well laid, wide Tar Roads
- Frequent city buses from Koti (12C, 102M, 102R & 103)
- All flats are well ventilated & ducts free
- Project is located nearer to well developed Townshipslike DRDO & Midhani

**COMMON FACILITIES**

● A Multipurpose Shopping Complex ● Provision for School & Hospital ● Space for Community Hall, Gym & Indoor Games ● Recreational facilities like Ladies & Gents Clubs ● Cable T.V. by Maha Vision ● A well developed play ground for children ● A Telephone Club for those who don't possess own telephones

**MAHANAGAR BRANCH OFFICE**
# 113, Vinay Nagar Shopping Complex, Santhosh Nagar 'X' Road. ✆ : 4534585

**CONTACT AT CORPORATE OFFICE**
N. Nandanandan Reddy B.Tech (Civil), General Manager, ✆ : 3222666 3222999

ఈ రేట్లు ఉగాది వరకే పరిమితం



K. RAVINDER REDDY
B.Tech (Civil), MIE, MIGS
Chairman & Managing Director

CITIZEN ADS

*Engineers who know housing better*

**ENGINEERS SYNDICATE (INDIA) PVT.LTD.**

(Promoted by Janapriya Engineers Syndicate)

**Corporate Office** : Janapriya House, 3-6-115/A, **Himayathnagar**, Hyd.-29. ✆ : 3222999, 3222666, 3220209, 230202, Fax : 040-3227515

**Administrative Office** : # 468, 13th Cross, Wilson Garden, Bangalore ✆ : 2271381 Fax.: 080-22106181

**Branch Offices** : **Janapriya Quarters** Mohan Nagar, ✆ : 4040448 **Janapriya Township** Nacharam, ✆ : 7154141 **Janapriya Apartments** Miyapur, ✆ : 3045544

TEAM OF ENGINEERS DREAM OF MASSES

ఉండిపోయాము. రెండు రోజుల వరకు బయటికి రాలేకపోయాము. పడ్డాము. బాధపడ్డాము. ఏదైనా చెయ్యాలనుకున్నాను. కానీ ఏమీ చేయకుండానే నాలుగు రోజుల తర్వాత గది ఖాళీ చేశాను. జ్ఞాపకాలను తుడిపేసుకునేందుకు ప్రయత్నించాను. కాలమే అన్నింటికీ పరిష్కారమని గడిపేస్తున్నాను.

ఆయన చెప్పడం ఆపి... నిశబ్దంగా ఇసుకలో ఏదో గీస్తూ కూచుని ఉండిపోయాడు. బహుశా కన్నీళ్ళు అతని గొంతుకు అడ్డుపడి ఉంటాయి. రెండు నిమిషాల తర్వాత అన్నాను. గడచిపోయిన దాన్ని మరచిపోండి. మీరే అన్నట్టు జీవితం విశాలమైందికదా....

నేనామెకు చాలా రుణపడి ఉన్నాను. ఆమె స్థానాన్ని నాకు ఇచ్చినందుకు ఆమెకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నేను మిమ్మల్ని పూర్తిగా విశ్వసిస్తున్నాను. నా ఈ ఆశను మన్నించండి.

ఆయన కొద్దిసేపటి మౌనం తర్వాత అన్నాడు. నేనేమీ మాట్లాడలేకపోతున్నాను. రేపు మళ్ళీ మనం ఇక్కడే కలుద్దాం. రేపు తప్పకుండా నేను మీతో పాటుగా క్రొత్తలోకానికి శ్రీకారం చుట్ట వచ్చు.

నాకిప్పుడు చాలా సంతోషంగా ఉంది.

ఆయన కుడిచేతిని నా రెండు చేతులతో పట్టుకుని నా పెదాలను అనించాను.

* * * * *

ఇసుకలో నడుస్తూ వెళుతుంటే ఏదో క్రొత్తగా అనిపిస్తుంది. గాలిలో నడుస్తున్నట్టుగా ఉంది. ఏవేవో ఆలోచనలు నా మస్తిష్కంలో... సముద్రహోరు ఎవరో... చేయితిరిగిన విద్వాంసుడు మృదంగం వాయిస్తున్నట్టుగా ఉంది. ఆకాశం ప్రశాంతంగా ఉంది. సముద్రం పై నుండి చల్లని గాలి బుగ్గలను తాకుతుంది. మా చోటు దగ్గరవుతున్న కొద్దీ నాలో ఏదో అనుభూతి రెక్కలు విప్పకుంటుంది. ఆ పొదదాటితే... మా చోటు... ఆయన వచ్చేసి ఉంటాడా!?

బహుశా ఎదురుచూస్తూ ఉంటాడు. అనుకోకుండానే నడక మరింత వేగం పెరిగింది.

వెనగ్గా వెళ్ళి సర్‌ప్రయిజ్ ఇవ్వాలి.

అదిగో... అతను....!

అతను... అతని ప్రక్క.....!!???

రండి... రండి...! అతనిలో ఏదో క్రొత్త సంతోషం నేను నిన్న ఇక్కడి నుండి వెళ్ళేసరికి ఈమెవచ్చింది. వాళ్ళ నాన్నతో, బంధువులతో... పోట్లాడి వచ్చేసింది. ఈ ఊరికి నాలుగు రోజులైనా నా గది తెలుసుకోడానికి సమయం పట్టింది.

ఈమే... అంటూ... ఆమెకు నన్ను పరిచయం చేయబోయాడు.

తెలును... నమస్తే! మీ గురించి చెప్పారు అంది ఆమెకు నమస్కరిస్తూ... అతను ఆమె గురించి ఏదో చెపుతూనే ఉన్నాడు.

సరే... రేపు మీరిద్దరూ మా ఇంటికి తప్పకుండా రావాలి అన్నాను కొంత సేపు సంభాషణ తర్వాత.

ఆ తరువాత వాళ్ళిద్దరు సెలవుతీసుకున్నారు. నేను వెనుదిరిగి రెండు అడుగులు వేసి సముద్రం వంక చూస్తూ కూలబడిపోయాను. సముద్ర అలలు విరుచుకుపడుతున్నాయి. చీకటి పడే వరకూ అలాగే ఉండిపోయాను.




జీవితానికి అత్యంత అందమైనదేమిటి!?

ప్రశ్న పాయలు పాయలుగా సుళ్ళు తిరుగుతుంది సమాధానమిప్పుడు మౌనమే అయ్యింది.

## నాటకం



గోవిందా ఎప్పుడూ షూటింగ్‌లకు లేటుగా హాజరౌతాడు. గోవిందాతో షూటింగు అంటే అందరికీ హడలే. పైగా షూటింగుల్లో తరుచూ అనారోగ్యం పాలౌతుంటాడు. ఇదంతా గిట్టని వాళ్ళు నాటకంగా కొట్టి పారేశారు కానీ అసలు విషయం వాళ్లకి తెలీదంటాడు గోవిందా. గోవిందాకు లో.బి.పి. వుందని డాక్టర్లు తేల్చారు. అందువల్ల తనకు ఆరోగ్యం బాగోదని అంతేకాని అది నాటకం కాదని అన్నాడు.

## గుణపాఠం.

బాలీవుడ్ కొరియోగ్రాఫర్ సరోజ్‌ఖాన్ కు ఇండస్ట్రీలో మంచి గౌరవ మర్యాదలున్నాయి. అక్షయ్ కుమార్ మాధురీ దీక్షిత్ కలిసి నటిస్తున్న ఒక చిత్రానికి ఆమె కొరియోగ్రాఫ్ చేయవలసి వుంది. అయితే అక్షయ్ కుమార్ మధ్యలో అడ్డుకుని తనికిష్టమైన కొరియోగ్రాఫర్ ఆమె స్థానంలో వచ్చేలా రాజకీయం చేశాడు. కాని కొత్త కొరియోగ్రాఫర్ విరమించుకోవడంతో ఘుల్షీ సరోజ్ ఖాన్‌నే నిర్మాత శరణు కోరాడు. ఆమె ససేమీరా అనడంతో చివరకు అక్షయ్ కుమార్‌నే అడిగించాడు . ఆమె సినిమా కు నేను కొరియోగ్రాఫ్ ఫస్తే చెయ్యను అందిట.

